# రామన్నపై నమ్మకం ఉన్నది

- అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం
- బీజేపీ కౌన్సిలర్ ముప్పిడి సునందశ్రీనివాస్
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక
- గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన నరసింహారావు



కౌన్సిలర్ ముప్పిడి సునందకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, పక్కన జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు, నాయకులు

వేములవాడ, నవంబర్ 7: వేములవాడను దత్తత తీసుకొని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్న మంత్రి కేటీఆర్ మాటలపై మాకు పూర్తిస్థాయి నమ్మకం ఉందని.. అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని పార్టీలో చేరామని బీజేపీ కౌన్సిలర్ ముప్పిడి సునంద–శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని 26వ వార్డు బీజేపీ కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ముప్పిడి సునంద–శ్రీనివాస్, నాయకుడు రాంపల్లి రాంబాబు, కాంగ్రెస్ యువజన నాయకుడు పడిగెల మహేశ్‌రెడ్డిని మంగళవారం వేములవాడలోని చల్మెడ నివాసంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సునంద–శ్రీనివాస్ మాట్లాడుతూ, యూత్ ఐకాన్‌గా ఉన్న మంత్రి కేటీఆర్ వేములవాడను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పిన మాటలను విశ్వసించి పార్టీలో చేరామని తెలిపారు. తాము కూడా ప్రజల పక్షాన అభివృద్ధి కోసం నిలబడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో చల్మెడ లక్ష్మీనరసింహారావు గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. తోట ఆగయ్య మాట్లాడుతూ, మంత్రి కేటీఆర్‌పై నమ్మకంతో పార్టీలో చేయడం శుభసూచకమని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తప్పనిసరిగా ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, యాచమనేని శ్రీనివాసరావు, నాయకులు రామతీర్థపు రాజు, నామాల లక్ష్మీరాజం, మాడాడి గజానందరావు, తీగల రవీందర్‌గౌడ్, నరాల దేవేందర్, గూడూరి మధు, గోపు బాలరాజు, అక్రమ్ పాషా, వాసాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ కాంగ్రెస్ యువజన నేత మహేశ్‌రెడ్డికి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న తోట ఆగయ్య

# గ్యారెంటీలు నమ్మి ఆగంకావొద్దు

- బీఆర్ఎస్ వస్తే సంక్షేమం.. కాంగ్రెస్ వస్తే అంధకారం
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- పలు గ్రామాల్లో ప్రచారం ● బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



కొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 7: ఆరు గ్యారెంటీల పేరుతో దొంగ మాటలు చెప్పి ఊళ్లలోకి వస్తున్న పగటి బిచ్చగాళ్ల మాటలు నమ్మి ప్రజలు ఆగం కావొద్దని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. మంగళవారం మండలంలోని మక్తపల్లి, నల్లగొండ, సాహెబ్‌పల్లి, బాలయ్యపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నల్లగొండకు చెందిన కాంగ్రెస్ నాయకులు 30 మంది బీఆర్ఎస్‌లో చేరగా ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో సాగునీరు లేక ఉన్న ఊరును, కన్నవాళ్లను వదిలి గల్ఫ్ దేశాలు, బొంబాయికి బతుకుదెరువు కోసం వెళ్లారని, కేసీఆర్ సీఎం అయ్యాక కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్షలాది ఎకరాలకు సాగునీళ్లు అందించి రైతులను కంటిరెప్పలా కాపాడుకుంటున్నట్లు తెలిపారు. ఒకప్పుడు కరెంటు, సాగునీళ్లు లేవని, కేసీఆర్ సీఎం అయిన తర్వాతనే వ్యవసాయానికి 24 గంటల కరెంటు, రైతుబంధు ద్వారా ఎకరాకు ₹10వేల పెట్టుబడి సాయం, రైతుబీమా ద్వారా ₹5 లక్షల సాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో అంశాలను వివరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## యువసారథికే
# పట్టంకడుదాం

- గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం
- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన
- రామన్నకు లక్షకు పైగా మెజార్టీ అందించాలని అభ్యర్థన



సిరిసిల్ల రూరల్: కేసీఆర్‌నగర్ లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, నేతలు

సిరిసిల్ల, నవంబర్ 7: సిరిసిల్ల నియోజకవర్గంలో అన్ని గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు మద్దతుగా పార్టీ శ్రేణులు చేపట్టిన ప్రచారం జోరందుకున్నది. తొమ్మిదిన్నర ఏండ్లల్లో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి గడపగడపకూ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. యువసారథి రామన్నకు లక్షకు పైగా మెజార్టీ అందించి మరోసారి పట్టంకడుదామంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కారు గుర్తుకే ఓటేసి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిస్తున్నారు. కాగా, తంగళ్లపల్లి మండల ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లు, ఓనర్లు రామన్నకే సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం నర్సయ్య, గంభీరావుపేట మండలంలో జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి హన్మంతరెడ్డి, ముస్తాబాద్ మండలంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ గోపాల్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు బాపురావు, వీర్నపల్లి మండలంలో జడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, తంగళ్లపల్లి మండలంలో ఎంపీపీ మానస, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నేతలు రామన్నకు మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు.

# మా మద్దతు కేటీఆర్‌కే..

బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, సీనియర్ నేత బొల్లి రామ్మోహన్‌కు తీర్మాన పత్రం అందజేస్తున్న తంగళ్లపల్లి మండల ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు



- తంగళ్లపల్లి మండల ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
- అభినందించిన బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, సీనియర్ నేత బొల్లి రామ్మోహన్

సిరిసిల్ల రూరల్, నవంబర్ 7: సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు రోజురోజుకు మద్దతు వెల్లువెత్తుతున్నది. మంగళవారం తంగళ్లపల్లి మండల ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లు, ఓనర్లు సంపూర్ణ మద్దతు పలికారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి, బీఆర్ఎస్ సీనియర్ నేత బొల్లి రామ్మోహన్ సమక్షంలో రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావుకు తీర్మానపత్రం అందజేశారు. మంత్రి కేటీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని, సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని తెలిపారు. గంపగుత్తగా కేటీఆర్‌కే ఓటేస్తామని, లక్షకుపైగా మెజార్టీ రావడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర నేత చీటి నర్సింగరావు మాట్లాడుతూ, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు మంత్రి కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపడం సంతోషకరమన్నారు. అమాత్యుడు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అంతకుముందు బీఆర్ఎస్ సీనియర్ నేత బొల్లి రామ్మోహన్ మాట్లాడుతూ, ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు తెలంగాణ ఉద్యమంతోపాటు జిల్లా ఉద్యమంలోనూ భాగస్వామ్యం అయ్యారన్నారు. మంత్రి కేటీఆర్ మొదటి నుంచి అండగా ఉన్నారన్నారు. కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతు పలుకడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసాని శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజి, ఉపాధ్యక్షుడు ఆలకుంట దుర్గయ్య, క్యాషియర్ గరిపెల్లి వెంకన్న, సల్లంగుల బాలకృష్ణ, పసుల బాలకృష్ణ, పూర్ణచందర్, చందా భాస్కర్, దారంగుల రాజు, గంగారెడ్డి, రఘుపతిరెడ్డి, సంపత్, రామకృష్ణ, సూర నాంపల్లి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి

దేవేందర్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

- ఆయనను హ్యాట్రిక్ సీఎం చేద్దాం
- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- కాంగ్రెస్ నేతకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానం



గంభీరావుపేట, నవంబర్ 7: ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తోనే గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి సాధ్యమని, ప్రగతిని చూసి ఆయా పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయమని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు కొనియాడారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నేత కొంకటి దేవేందర్ మంగళవారం కొండూరి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రవీందర్‌రావు ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండూరి మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి అమాత్యుడు రామన్నకు లక్షకు పైగా మెజార్టీ అందించాలని కోరారు. కేటీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీ అందిస్తేనే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసేలా విస్తృత ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, ఆర్‌బీఎస్ కన్వీనర్ రాజేందర్, ఉపసర్పంచ్ సింగారపు నాగరాజుగౌడ్, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, గంధ్యాడపు రాజు, ధన్‌రాజ్, గ్యార దేవరాజు, వెంకటస్వామిగౌడ్, శివయ్య, సందీప్, శ్రీహరి, దేవేందర్ పాల్గొన్నారు.